క్లుప్తంగా

దళితరత్న అవార్డు ప్రదానం



మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారం గ్రామానికి చెందిన తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాజమళ్ల సుకుమార్ సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డును గురువారం అందుకున్నారు. తెలంగాణ ఉద్యమ కారుడు, దళిత సామాజిక ఉద్యమ కారుడైన సుకుమార్ దళిత గిరిజన ప్రజా సమస్యలపై వారి అభ్యున్నతికి నిత్యం పోరాటం చేస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దళిత రత్న అవార్డును ప్రకటించింది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సుకుమార్‌కు ఘనంగా సన్మానించి అవార్డుతో సత్కరించారు.

కమిటీ ఎన్నిక



వాజేడు: ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసం ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా తాటి రవి, కార్యదర్శిగా అబ్బు శ్రీను ఎన్నికైయ్యారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

మంగపేట: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 125/1లో పగిడిపల్లి వెంకటేశ్వర్లు నిర్మించిన అక్రమ రేకులషెడ్డును రెవెన్యూ అధికారులు వెంటనే తొలగించాలని మన్యసీమ పరిరక్షణ సమితి డోలుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్లుకు ఏ అధికారులు ఇంటి స్థలాన్ని కేటాయించలేదని పేర్కొన్నారు. అక్రమ నిర్మానాన్ని తొలిగించాలని కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ గిరిజనేతరుడు అయిన పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఇంటిని తొలిగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

హక్కుల సాధనకు పోరాటం



భూపాలపల్లి రూరల్: రానున్న రోజుల్లో జిల్లా విద్యుత్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని యూనిటైడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి తెలిపారు. గురవారం జిల్లా కేద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యుత్ ఉద్యోగులు వివిధ సంఘాల నుంచి దాదాపు 40 మంది అర్టిజన్స్ సీఐటీయూలో చేరారు. యూనియన్‌లో చేరిన ఉద్యోగులకు స్వామి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల15న ప్రభుత్వంతో జరిగిన ఒప్పందంలో విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీలో నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆర్టిజన్ ఉద్యోగులకు కన్వర్షన్ ఇవ్వాలని, మీటర్ రీడర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఉద్యోగుల తరపున యూనియన్ ఆధ్వర్యంలో హక్కుల సాధనకు ఉద్యమాలు చేస్తామన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రమేష్, నాయకులు ఆంజనేయులు, చంద్రారెడ్డి, కోటి, కొమురయ్య, రాజు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



పలిమెల: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొదని పలిమెల ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా గురువారం మండలంలోని మోదేడు గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై అరుణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. మావోయిస్టులకు సహకరించిన, ఆశ్రయం కల్పించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అటవీ జంతువులని వేటాడినట్లు తెలిస్తే కేసులు నమోదు చేసి జైలుకి పంపుతామని తెలిపారు. ఎండాకాలం నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులకు వెళ్లేవారు వడదెబ్బ తగలకుండా తగిన నీరు తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్సై-2 శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

‘కేంద్రాల’ ప్రారంభమెప్పడో?

- మొదలైన వరికోతలు
- దళారులకు విక్రయిస్తున్న రైతులు



తిమ్మంపేట వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం రాశులు

మంగపేట: మండలంలో యాసంగి వరి సాగుచేసిన రైతులు కోతలు కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారో అని ఎదురుచూపు చూస్తున్నారు. మండల పరిధిలో దాదాపు 13,000 ఎకరాల్లో వరి పంట సాగుచేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల అంచనా వేశారు. అదనంగా మరో 5000 ఎకరాలకు పైగా సాగు చేసినట్లు తెలుస్తొంది. సాధారణ వరితో పాటు మండలంలోనిపలు గ్రామాల్లో రైతులు మేల్ ఫిమేల్ వరి పంటను సుమారు 1000 నుంచి 1500 ఎకరాల్లో సాగు చేశారు. 15 రోజుల నుంచే మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి.

వర్ష సూచనతో రైతుల్లో ఆందోళన

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా వర్షాలు పడే ప్రాంతాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లా ఉండటంతో పాటు ఈదురుగాలుతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో కల్లాల్లో ఆరబెట్టి ఉంచిన రైతులతో పాటు ఇప్పటికే ఆరబెట్టి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన రైతులో ఆందోళన నెలకొంది.

ప్రైవేట్‌కు విక్రయిస్తున్న రైతులు

మండలంలో ధాన్యం ఆరబెట్టి పది రోజులకు పైగా గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో వర్షాలు పడితే నష్టపోయే ప్రమాదం ఉండటంతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి నెకొందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలు పడే అవకావాలు ఉండటంతో పాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో తప్పని పరిస్థితుల్లో రైతులు దళారులకు పచ్చి ధాన్యం పొలాల వద్దనే విక్రయిస్తున్నారు. ధాన్యం క్వింటాకు రూ.2060 ఉండగా రూ.1400 నుంచి రూ.1600 వందలకు దళారులకు విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి త్వరగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి త్వరగా కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి. వర్షాలు పడే సూచనలు ఉన్న కారణంగా ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలి.

– మూగల రమేష్, రైతు, బోరునర్సాపురం

ప్రారంభిస్తాం..

జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, జీసీసీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు 150 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఆయా మండలాల్లోని సంబంధిత సెంటర్ నిర్వాహకులు, సీఈఓలు, అధికారులతో శుక్రవారం(నేడు) సమావేశం నిర్వహించి శనివారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం.

– రాములు, సివిల్‌సప్లై డీఎం, ములుగు

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



నియామక పత్రాన్ని అందజేస్తున్న సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్షుడిగా బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షుడిగా జాలపు అనంతరెడ్డిలను ఎన్నుకుని నియామపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, సర్పంచులు ఇర్ప సునీల్, రేగ కల్యాణి, కాంగ్రెస్ పార్టీ మాజీ బ్లాక్ అధ్యక్షుడు ఎండీ ముజఫర్‌హుస్సేన్, నాయకులు రవికుమార్, సిద్దిరెడ్డి, మల్లయ్య, సతీష్, ముద్రం కోళ్ల తిరుపతి, తండాల శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాళ్ల గూడెం గొత్తికోయ కాలనీలో గురువారం ఇంటింటా ఫీవర్‌సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులను గుర్తించి వారి నుంచి రక్త నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం సీతారావమ్మ, ఆశకార్యకర్తలు రాణి, నాగమణి తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



పద్మకు ఫోన్ అప్పగిస్తున్న ఓఎస్డీ అశోక్‌కుమార్

ములుగు: వాజేడు మండలం పెద్ద గంగారం గ్రామానికి చెందిన గూడపు పద్మ పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి 24 గంటల సమయంలోపే పోలీసులు తిరిగి అప్పగించారు. ఈ మేరకు ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్ తన చేతుల మీదుగా గురువారం జిల్లాకేంద్రంలో పద్మకు అందించారు. ఓఎస్డీ తెలిపిన వివరాలు ప్రకారం ఫోన్‌ను పోగొట్టుకున్నట్లుగా గుర్తించిన పద్మ పేరూరు పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై స్పందించిన పేరూరు పోలీసులు నూతనంగా అందుబాటులోకి వచ్చిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) ద్వారా ప్రయత్నించి సఫలీకతం అయ్యారు. నూతన టెక్నిలజీపై సిబ్బందికి ట్రెనింగ్ ఇస్తున్నట్లుగా తెలిపారు. ఓఎస్డీ వెంట ఏటూర్‌నాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సీఐ శివప్రసాద్, ఎస్బీ సీఐ శ్రీనివాస్, పేరూరు ఎస్సై హరీశ్, ఐటీకోర్ టీం సభ్యుడు రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



వెంకటాపురం(కె): సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ఎస్ఎస్ తాడ్వాయి: ఎంపీపీ వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ఎస్ఎస్‌తాడ్వాయి: తమను రెగ్యులరైజేన్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) గురువారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొంది వాణిశ్రీ, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. నాలుగు సంవత్సరాల ప్రొహిబిషన్ కాలం పూర్తయినందున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ కార్యాయలం ఆవరణ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ అడ్డూరి బాబుకు గురువారం సమ్మె నోటీస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబిషన్ కాలం ముగుస్తున్న ప్రభుత్వం కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయటంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవటం లేదని అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో సమ్మె చేస్తమని నోటీస్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంజీవరావు, ప్రవీణ్, జనార్ధన్, మౌనిక, సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ జగదీశ్

ములుగు: సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరమని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అన్నారు. ములుగు మండలంలోని మాధవరావుపల్లి గ్రామానికి చెందిన దూడబోయిన చిన్నలక్ష్మీ అనారోగ్యం పాలవగా ప్రభుత్వం తరుపున మంజూరి అయిన రూ.లక్ష 25 వేల విలువ గల చెక్కును గురువారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో కుటుంబ సభ్యులకు జెడ్పీ చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ఈ పథకాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు విజయ్, ఎంపీపీ గంద్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



నూతన కమిటీ సభ్యులు

ఏటూరునాగారం: పోడు భూములకు పట్టాలివ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండలంలోని గోగుపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు దరఖాస్తులు తీసుకోని ఏడాది అవుతున్న ఇంత వరకు దానిపై ఎలాంటి చర్యలు లేవన్నారు. అనంతరం గోగుపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రరెడ్డి రాజశేఖరెడ్డి, ఉపాధ్యక్షుడిగా యాస నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక రాకేష్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడిగా ఈసం మహేష్, ప్రధాన కార్యదర్శిగా రాజును నియమించారు. ఎల్లయ్య, వినయ్‌కుమార్, లాల్‌మహ్మద్, రవి, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల డుమ్మా

- మండల సభకు ఎంపీపీ, ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరు
- హాజరుకాని సర్పంచ్‌లు



వైద్య సేవలను వివరిస్తున్న డాక్టర్ చిరంజీవి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొంది వాణిశ్రీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మిగత ఎంపీటీసీలతో పాటు ఒక సర్పంచ్ కూడా హాజరు కాలేదు. దీంతో మండల సభ సమావేశం మొక్కుబడిగా సాగింది. మండల సభలో ప్రజా సమస్యలపై చర్చించే వారే లేకుండా పోయారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం గమనార్హంగా ఉంది. గ్రామాల్లోని సమస్యలపై అధికారులకు ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో మండల అధికారులు నివ్వరపోయారు.

మొక్కుబడిగా సమావేశం

ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోడంతో సభ మొక్కుబడిగా నిర్వహించారు. ఆయాశాఖల అధికారులు సమస్యలపై నివేదికలను చదివి వినిపించారు. కొడిశాల పీహెచ్‌సీ భవనం చుట్టు ప్రహరీ నిర్మించాలని, కనీసం ఫెన్సింగ్ ఏర్పాటైనా చేయాలని మండల సభలో వైద్యాధికారి గౌతమ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ సత్యాంనేయప్రసాద్ వైద్యాధికారులకు సూచించారు. బీరెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సక్రమంగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు కరెంట్ సమస్య తలెత్తకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు ట్రాన్స్‌కో అధికారులను కోరారు.ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఐటీడీఏ డీటీడీఓ దేశిరాంనాయక్, వైద్యాధికారులు చిరంజీవి, రంజిత్‌కుమార్, ఏఈఓ పోరిక జైసింగ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న గఫూర్

ములుగు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని వెంటనే అమలు చేయాలన్నారు. పోడు సాగుదారులకు పోడు పట్టాలు అందిస్తామని నేటికి అమలు చేయడంలేదని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణితో రైతులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సామ చంద్రారెడ్డి, గుండు రామస్వామి, సురేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

మొగుళ్లపల్లి: వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని కొర్కిశాల, అప్పయ్యపల్లి, బద్దంపల్లి మొట్లపల్లి, గుండ్లకర్తి మెట్టుపల్లి గ్రామాలల్లో గండ్ర సత్యనారాయణరావు హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఓటేసి గెలిపిస్తే పేదలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని తెలిపారు.

న్యాయం చేయాలంటూ వేడుకోలు

వాజేడు: జ్వరం వచ్చిందని ప్రైవేట్ వైద్యశాలకు వెళితే ఇంజక్షన్ వేశారు. దీంతో బాలుడి కాలు సైజు తగ్గడంతో పాటు ఇబ్బందులు పడుతున్నట్లు బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల ఇలా ఉన్నాయి..మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన బొగట శ్రీలత, జనార్దన్‌ల కుమార్ ప్రణీత్‌కు మూడు సంవత్సరాలు. కాగా, ప్రణీత్‌కు మూడు నెలల క్రితం జ్వరం వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వైద్యం నిమిత్తం వెళ్లారు. వీరు అక్కడికి వెళ్లిన సమయంలో ఆర్ఎంపీ వైద్యుడు లేక పోవడంతో అతని బంధువు ప్రణీత్‌కు ఇంజక్షన్ చేసినట్లు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. జ్వరం తగ్గి పోయిన తరువాత కొన్ను రోజులకు ప్రణీత్ ఎడమ కాలు సైజు తగ్గడంతో పాటు పడి పోయినట్లుగా కనిపించిందన్నారు. దీంతో తమ కొడుకు న్యాయం చేయాలని సదరు ఆర్ఎంపీని కోరినట్లు తెలిపారు. దీంతో ఆర్ఎంపీ వైద్యుడు ఏటూరునాగారంలో కాలుకు 16 రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించలేదని కొడుకు పెరుగుతున్న కొద్ది కాలు సమస్య తీవ్రం అవుతుందని వైద్యుడు స్పందించి మెరుగైన వైద్యం అందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



ప్రణీత్‌తో తల్లిదండ్రులు శ్రీలత, జనార్దన్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యజమానులు

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి కేంద్రానికి చెందిన మెకానిక్ వెంకటేశ్వరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆటో మొబైల్ షాపు యజమానులు, మెకానిక్ వర్కర్స్ యూనియన్ సభ్యులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం పుల్లారావు, చిట్టెం వాసు, బంగారు రాజు, తాడేటి సర్వేశ్వరావు తదితరులు ఉన్నారు.